క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి


ఆటోలో ప్రచారం చేస్తున్న టూటౌన్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: వేసవిలో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని టూటౌన్ పోలీసులు వినూత్నంగా ప్రచారం చేపట్టారు. ఈ మేరకు బుధవారం టూటౌన్ పరిధిలోని యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు, సంతోష్‌నగర్, రాజీవ్‌నగర్, తారకరామనగర్ తదితర ఏరియాల్లో ఆటోలో మైక్ ద్వారా ప్రచారం చేశారు. ఆరుబయట పడుకునే వారు ఇంటికి తాళం వేసి, ఇంటిముందు లైట్‌వేసి ఉంచాలని, ఎవరైనా ఊరికి వెళితే విలువైన బంగారు ఆభరణాలు ఇంట్లో ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా అపరిచితులు కనిపిస్తే 100 కుకాల్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై శ్యామ్‌పటేల్, సిబ్బంది తెలిపారు.

సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లు అందిస్తున్న సోమారపు లావణ్య

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లోని గౌతమిరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యాలయంలో మగ్గం, టైలరింగ్‌లో శిక్షణ పొందిన 20మంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకురాలు సోమారపు లావణ్య బుధవారం సర్టిఫికెట్లు అందించారు. లావణ్య మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధికి ఉచిత శిక్షణ ద్వారా మగ్గం, టైలరింగ్, ఫ్యాషన్‌డిజైనింగ్ వంటి కోర్సులు నేర్పిస్తున్నామన్నారు. త్వరలోనే నూతన బ్యాచ్‌ను ప్రారంభిస్తామన్నారు. ట్రస్ట్ ట్రైనీ శిరీష, అనూష, స్వప్న, శ్యామల కవిత, సబిత, ఉష, స్వరూప, శిరీష, రమ్య, గాయత్రి, శైలజ, అంజలి పాల్గొన్నారు.

వృత్తి విద్యాశిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్యదర్శులు

జూలపల్లి: ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు అందిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రమాదేవి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. శిక్షణ తీసుకునే వారికి కాచాపూర్, వడ్కాపూర్, జూలపల్లి,పెద్దాపూర్ మీదుగా ఉచితబస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.కార్యక్రమంలో కార్యదర్శులు అర్చన, సతీశ్,ఆంజలీధర్, కో ఆర్డినేటర్ గుంటి శంకర్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం


కళాకారుడిని సన్మానిస్తున్న సభ్యులు

జూలపల్లి: మండలకేంద్రంలోని గ్రంథాలయంలో బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. 14న డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు కూకట్ల తిరుపతి, చిత్రకారుడు, రచయిత గుండు రమణయ్య, తెలుగు ఉపాధ్యాయుడు కవి, జవ్వాజీ రాజనర్సయ్యను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సయ్య, పీఏసీఎస్ సీఈవో సురేశ్, ఏఈవో శ్రీవాణి, గ్రంథపాలకుడు, పాఠకులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శంకర్ గౌడ్

కమాన్‌పూర్: మండలంలోనిజూలపల్లి గ్రామం తూర్పువాడలోని పెద్దమ్మ ఆలయం నుంచి ప్రశాంత్‌నగర్ వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్ ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఆర్జీ–3 రేమిడిషన్ నిధులు రూ.50 లక్షలు మంజూరవడంతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు రాధాకృష్ణ, రఘుపతి, విలాస్ శ్రీనివాస్ పోద్దారు, షఫీ, ఎంపీటీసీ శంకరయ్య ఉపసర్పంచ్ సాయికుమార్, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభావంతులు

గురుకులం విద్యార్థులు

- వసతులు కల్పించాలని విద్యార్థుల విన్నపాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అవకాశం ఇస్తే విద్యార్థులను మరింతగా తీర్చిదిద్దుతాం: పీఈటీ


అంతర్జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: కబడ్డీ, రన్నింగ్, టెన్నీస్, క్రికెట్, వాలీబాల్, కరాటే... వంటి క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయస్థాయిలో బంగారు పతకాలు సాధించి క్రీడల్లో సత్తా చాటుతున్నారు. గోదావరిఖని సప్తగిరికాలనీలోని రామగుండం మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర పాఠశాల విద్యార్థులు. చదువుల్లోనే కాకుండా క్రీడల్లో సాధన చేస్తూ గురుకులానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొస్తున్నారు.

కబడ్డీ:
2023 జనవరి 1న నేపాల్‌లో నిర్వహించిన 2వ జూనియర్ ఇంటర్నేషనల్ మీట్ కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఇండియా తరఫున ఎ.రాంచరణ్.ఎస్.యోగేందర్, యూ.మణిదీప్ మొదటి బహుమతి సాధించారు. కబడ్డీ పోటీల్లో శివచరణ్, ఎ.మనోజ్, యూ.రాజ్‌కుమార్, బి.గణేష్‌నాయక్, బి.ఆకాశ్ గతేడాది 2022 నవంబర్ 29న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి సాధించారు.

క్రికెట్:
2022 ఏప్రిల్ 18 నుంచి 23 వరకు గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి క్రికెట్ టోర్నీలో ఎస్.శ్రీచరణ్, యూ.మణిదీప్, ఎస్.యోగేందర్, జె.అక్షయ్ జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించారు.

కరాటే:
సీహెచ్.అశ్విన్ 2022 ఆగస్టు 10న జపాన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మొదటి బహుమతి సాధించాడు.

టెన్నీస్:
కాసర్ల వినయ్‌కుమార్ 2022 అక్టోబర్ 23న వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. వినయ్‌కుమార్‌ను జాతీయ స్థాయి పోటీలకు అండర్ 16 విభాగంలో టెన్నీస్ క్రికెట్ అసోసియేషన్ ఎంపిక చేసింది. నవంబర్ 7న మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

రన్నింగ్, వాలీబాల్:
బాదావత్ గణేశ్‌నాయక్ గతేడాది 2022లో జిల్లాస్థాయి రన్నింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2022 అక్టోబర్ 18న తిరుపతిలో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో గణేశ్, ఆర్.ప్రేమాస్ 3వ స్థానం సాధించారు.

ఖోఖో:
ఆర్.రాకేశ్, పవన్‌సాయి, ఎస్.అరవింద్ గతేడాది 2022 అక్టోబర్ 18న తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో 3వ స్థానం సాధించారు.

సరైన వసతులు లేవు



విద్యార్థుల ఆసక్తి మేరకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థుల ప్రాక్టీసుకు తగినంతగా గ్రౌండ్ లేదు. వారికి కావాల్సిన క్రికెట్ కిట్లు, బాక్సింగ్ కిట్స్ తదితర సామగ్రి అందుబాటులో లేవు. అదనపు శక్తి కోసం ప్రొటీన్స్ ఎక్కువగా ఉండే పోషకాహారం అందించాల్సి ఉంటుంది. క్రీడాకారులకు కావాల్సిన సామగ్రి, తగిన ఆహారం ప్రభుత్వం అందిస్తే క్రీడల్లో విద్యార్థులు మరింతగా రాణిస్తారు.
– ఎం.వెంకటేష్, పీఈటీ

చాలా ఆనందంగా ఉంది



చదువులతో పాటు విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తూ శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఏకాగ్రతతో ప్రాక్టీస్ చేస్తూ పతకాలు సాధించడం సంతోషంగా ఉంది. దీంతో పాఠశాలకు మంచి గుర్తింపు లభించింది.
– శ్రీకాంత్, ప్రిన్సిపాల్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నాకు రన్నింగ్, వాలీబాల్ అంటే చాలా ఇష్టం, రోజు గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తాను. పీఈటీ సార్ ప్రోత్సాహంతో రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించాను. మాకు లాంగ్ జంప్ హైజంప్‌కు సంబంధించిన పరికరాలు లేక పూర్తిస్థాయిలో శిక్షణ పొందలేక పోతున్నాం.
– గణేశ్‌నాయక్, 8వ తరగతి

అవకాశం ఇవ్వండి



చదువుతో పాటు రోజు మేము స్పోర్ట్స్ పీరియడ్‌లో గ్రౌండ్‌లో ప్రాక్టీస్ చేస్తుంటాం. కబడ్డీ అంటే నాకు చాలా ఇష్టం. మా ప్రిన్సిపాల్, పీఈటీల ప్రోత్సాహంతో చదువుతో పాటు ఆటల పోటీల్లో రాణించగలుగుతున్నాం. మా ప్రాక్టీసుకు కావాల్సిన పరికరాలు ఏర్పాటు చేస్తే మేము మరిన్ని పతకాలు సాధిస్తాం.
– మణిదీప్, 9వ తరగతి

ఫైలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మైక్రోఫైలేరియా పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

సుల్తానాబాద్: మైక్రోఫైలేరియా వ్యాధిరాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజమౌళి అన్నారు. బుధవారం సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థులను పరీక్షించి రక్తనమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రాజమౌళి వైద్యశిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థుల నుంచి రక్తంసేకరించి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న పాఠశాల యజమాన్యం సహకరించాలని కోరారు. డాక్టర్ మధుకర్‌రెడ్డి, సూపర్‌వైజర్ వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కుట్టుశిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


కుట్టుశిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ తిరుపతి

రామగిరి: ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లిలో నివేద వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ అల్లం తిరుపతి సూచించారు. గ్రామంలో బుధవారం కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కుట్టుశిక్షణ నేర్చుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి చిప్ప మమత మహిళలు పాల్గొన్నారు.

హామీలను తుంగలో తొక్కిన బీఆర్‌ఎస్


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జూలపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో బీఆర్‌ఎస్ సర్కారు విఫలమైందని కాంగ్రెస్ నాయకులు ఓదెల జెడ్పీటీసీ గంటా రాములు ఆరోపించారు. మండలకేంద్రంలో సమావేశం నిర్వహించి పార్టీ నాయకులు వేముల రాంమూర్తి, సత్యనారాయణ రెడ్డితోకలిసి మాట్లాడారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమలు చేయకపోతే రైతులు, నిరుద్యోగులతో కలిసి వినతిపత్రాలను సీఎం కేసీఆర్‌కు, కలెక్టర్లకు, మండల అధికారులకు ఇచ్చి నిరసన తెలుపుతామని, అలా స్పందించకపోతే ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం వేముల రాంమూర్తి మాట్లాడుతూ.. రుణమాఫీ చేయకపోవడంతో రైతుల ఖాతాలు ఎన్‌పీలకు వెళ్తున్నాయని దీంతో రైతులకు తీవ్రనష్టం కలుగుతోందన్నారు. రుణమాఫీ చేయకపోవడంతో వడ్డీలకు మళ్లీ వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని సత్యనారాయణరెడ్డి వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రుణమాఫీ, నిరుద్యోగ భృతి అమలు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు నాగరాజు, రాజయ్య, సంపత్ తదితరులు ఉన్నారు.

పశు వైద్యశిబిరం


వైద్యం చేస్తున్న పశువైద్యాధికారి

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో మండల వెటర్నరి వైద్యాకారిణి ఝాన్సీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పశువైద్య శిబిరంను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పశువులు పంచుకునే ప్రతి ఇంటిని సందర్శించి, పశువులకు ఉన్న వ్యాధులు, సమస్యలు తెలుసుకుని వైద్యం అందించారు. అనంతరం గొర్రెల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో 81యూనిట్‌లు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కావేరి, ఎలిగేడు మాజీ సర్పంచ్ రాయనర్సయ్య, మాజీ ఎంపీటీసీ గొల్లె భూమేశ్, పశుపెంపకందారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన సదస్సు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని యాదవ సంఘం కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన లబ్ధిదారుల సదస్సులో మండల పశువైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్, కమాన్‌పూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ దాసరి రాజలింగుతో కలిసి పాల్గొన్నారు. లబ్ధిదారులకు గొర్రెల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం నూతనంగా ఎంపికైన మార్కెట్‌కమిటీ చైర్మన్ రాజలింగును శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది మల్లికార్జున్, నారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీ.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలి

జ్యోతినగర్: ఈనెల 14 జిల్లాకేంద్రంలో నిర్వహించే బీ.ఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ సంగీత బుధవారం తెలిపారు. ఉదయం 10:30 గంటలకు బస్‌స్టాండ్ వద్ద అంబేడ్కర్ చౌరస్తాలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, ప్రతినిధులు, ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏగోలపు వెంకమ్మ సంస్మరణ సభ
పాలకుర్తి: రాణాపూర్ గ్రామానికి చెందిన మావోయిస్టు నేత మల్లయ్య అలియాస్ కమలాకర్ తల్లి సంస్మరణ సభ గ్రామంలో నిర్వహించారు. ఈనెల 3న అనారోగ్యంతో వెంకమ్మ మృతిచెందారు. బుధవారం దశదిన కర్మ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మావోయిస్టులు, పౌరహక్కుల నేతలు, రైతు సంఘాల నాయకులు హాజరై వెంకమ్మ సేవలను కొనియాడారు.

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ
జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌కు తాగునీరందించేందుకు పైప్‌లైన్ పనులకు ఈడీ సునీల్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. రూ.3కోట్లతో కొత్తగా పైప్‌లైన్ నిర్మించనున్నారు. పీటీఎస్‌కు కొత్త పైప్‌లైన్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రాజెక్టు నుంచి చేపడుతున్నారు.

నియామకం
జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధిగా పొన్నం విజయ్‌గౌడ్‌ను నియమిస్తూ రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నియామక పత్రం అందించారు. రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియామకపు ఉత్తర్వులను విడుదల చేశారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియామకం


అరుముళ్ల బాబు

రామగుండం: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన అరుముళ్ల బాబును తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీసెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియమించారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ప్రీతం చేతులమీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. తన నియామకానికి కృషిచేసిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్‌రావు, యూత్ కాంగ్రెస్ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ.వాజీద్‌ఖాన్,శ్యాంకు కృతజ్ఞతలు తెలిపారు.

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

రామగుండం: పట్టణంలోని లింగాపూర్ శివారులోని ఆదర్శ(మోడల్) విద్యాలయం నందు 2023–24వ విద్యా సంవత్సరంలో 6–10వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రవేశపరీక్ష ఈనెల 16న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యదర్శుల సంబరాలు

కాల్వశ్రీరాంపూర్: గ్రామ పంచాయతీ జూనియర్ కార్యదర్శులు నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు. గ్రామ పంచాయితీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలర్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, సూపరింటెండెంట్ సురేశ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, సతీశ్‌గౌడ్, అష్రఫ్, మంగారెడ్డి, సౌజన్య ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి
కమాన్‌పూర్: గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మారుపాక ప్రశాంత్ అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడడుతూ ప్రభుత్వం ఇచ్చిన నాలుగేండ్ల కాలం పూర్తి చేసుకున్నామని కార్యదర్శులను పర్మినెంట్ చేస్తుందని ఎంతో ఆశతో ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్య, కార్యదర్శులు వెంకటరమణ, నరేష్, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, రేణుక, విశాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు


చెక్కులు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ గడపకు చేరాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దపల్లి మండలం మారేడుకొండలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. ప్రజలకు, రైతులకు వివరించాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బండారి స్రవంతి శ్రీనివాస్, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, చైర్మన్ నరసింహారెడ్డి, కన్వీనర్ మేకల లక్ష్మణ్, మండల యూత్ అధ్యక్షుడు కొయ్యాడ విక్రమ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్
సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 217 మందిలబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.74.69 లక్షలు విలువైన చెక్కులను పంపిణీచేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి పాల్గొన్నారు

ఎల్లమ్మ తల్లి దీవెనలు అందరికీ ఉండాలి
కాల్వశ్రీరాంపూర్: ఎల్లమ్మ తల్లి దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు. మండలంలోని వెన్నంపల్లి ఎల్లమ్మ బోనాలు నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా గౌడకులస్తులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహిళలు నెత్తిన బోనాలు శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగళ తిరుపతి రెడ్డి, వైస్‌ఎంపీపీ శిరీష, సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ దేవేందర్, ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్ గౌడ్, మహిళలు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందులు సోదరభావాన్ని పెంపొందిస్తాయి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా స్థానిక లక్ష్మినగర్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద జామమజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ బుధవారం పాల్గొన్నారు. ఇఫ్తార్‌విందులు హిందూ, ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

రామగుండం: మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈమేరకు బుధవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని మజీద్–ఈ–ఉమర్ ఫారూఖ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, ఐఎన్‌టీయూసీ కార్మికసంఘం ప్రతినిధి బాబర్‌సలీంపాషా, సలీంబేగ్, రైల్వే ఉన్నతాధికారి రాంబాబు, పట్టణ ప్రజలు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘం

సుల్తానాబాద్: పెద్దపల్లి మండలం పెద్ద కల్వల గ్రామంలో వైభవంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వస్థలాన్ని ఇటీవల కేటాయించగా ఆస్థలంలో విగ్రహ ప్రతిష్ఠ చేసినట్లు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం జిల్లా కమిటీ సభ్యులు ప్రసాదం అందించారు. అనంతరం తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను ఆలయప్రాంగణంలో సభ్యులు ఆవిష్కరించారు కార్యక్రమానికి జిల్లాలోని విశ్వబ్రాహ్మణ కులస్తులు, పంచకులస్తులు, పురోహిత బృందం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతలకు పూజలు
ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాలు, గ్రామదేవతలకు పూజలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చిట్టబోయిన స్వరూప ఆధ్వర్యంలో గ్రామంలోని పోచమ్మ దేవతలకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పాల్గొని గ్రామదేవతలకు పూజలుచేశారు. కార్యక్రమంలో ఎల్కలపల్లి ఎంపీటీసీ సతీశ్, ఉప సర్పంచ్ మేకల రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్, బీజేపీ నాయకులు సోమారపు లావణ్య, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి సేవలో ఎన్టీపీసీ పద్మశాలీ సేవా సంఘం సభ్యులు
జ్యోతినగర్: టీటీడీ సన్నిధిలో ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన పద్మశాలీ సేవాసంఘం సభ్యులు సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు వొల్లాల మల్లేశం బృందం ఏడు రోజుల పాటు 15 మంది సభ్యులు సేవలో పాల్గొని ఆలయం శుభ్రం చేయడం, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా.. స్వామివారి దర్శనం 'క్యూ'లైన్‌లో వలంటీర్లు విధులు నిర్వహించారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు' వైద్యశిబిరం


వైద్యశిబిరంలో ఎంపీపీ, సర్పంచ్ తదితరులు

ఎలిగేడు: రాష్ట్రంలో అంధత్వ నివారణకు కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి అన్నారు. బుధవారం ఎలిగేడు మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఒక్కరు కంటి వెలుగు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా, సర్పంచ్ గోపు విజయేందర్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్తిరెడ్డి ప్రేమలత, ఉపసర్పంచ్ అనిల్‌గౌడ్, మాజీసర్పంచ్ రాయనర్సయ్య, కమలాకర్‌రెడ్డి, తానిపర్తి మోహన్‌రావు, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కంటివెలుగు పరీక్షలు చేయించుకోవాలి
జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్, నాగులపల్లె గ్రామాల్లో ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్యశిబిరంలో గ్రామస్తులు పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. బుధవారం రెండు గ్రామాల్లో కంటిపరీక్షలకు స్పందన వచ్చింది. అబ్బాపూర్‌లో 143మంది పరీక్షలు చేయించుకోగా 26 మందికి కంటి అద్దాలు అందించారు. నాగులపల్లెలో 164 మంది పరీక్షలు చేయించుకోగా 38 మందికి అద్దాలు పంపిణీ చేశారు. వైద్యులు రత్నాకర్, టెక్నిషీయన్, ఏఎన్ఎంలు అరుణ, సరిత, ఆశాలు పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి బోనమెత్తిన ఎంపీ, ఎమ్మెల్యే



రామగుండం:అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ తల్లి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలకు పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, అంతర్గాం జెడ్పీటీసీ ఆముల నారాయణ బోనమెత్తారు. గ్రామంలో ఊరేగింపు చేపట్టగా వారితో సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, ఎంపీటీసీ కొలిపాక శరణ్య భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. బోనాల వేడుకలకు ఎమ్మె ల్యే కోరుకంటి చందర్ రూ.50వేల నగదును గౌడ సంఘానికి అందించారు. ఈ వేడుకల్లో గౌడ కులస్తు లు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై ఎల్లమ్మ తల్లికి మొక్కులు సమర్పించారు.